RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

The Pride of Telugu national daily



Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శుక్రవారం 16-10- 2026 సంపుటి : 6 సంచిక : 244 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00

## సస్పెండ్ చేయాల్సింది డిప్యూటీ సీఎంను..

# చీఫ్ ఇంజనీర్‌ను కాదు!



2లో

- రాష్ట్రంలో విద్యుత్ కోతలకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- విద్యుత్ సమస్యలను పరిష్కరించకుండా అధికారులపై చర్యలా?
- నాసిరకం బొగ్గు సరఫరాతోనే విద్యుత్ సంక్షోభం ఏర్పడిందని ఆరోపణ
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజం

## మహిళా శక్తితోనే

# వికసిత భారత్ సాధ్యం

- మహిళలు మార్కెట్‌ను సృష్టించేవారిగా ఎదగాలి
- జాతీయ సరస్ మేళా ద్వారా 15 వేల మంది మహిళలకు నైపుణ్య శిక్షణ
- మహిళా సంఘాల ఉత్పత్తులకు నాణ్యత, బ్రాండింగ్, విస్తృత మార్కెట్లు
- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్



2లో

## రైతుబీమా అమలు చేయకుంటే

# సీఎం ఇంటిని ముట్టడిస్తం

- పథకం బంద్ పెట్టి అన్నదాతల ఉసురు పోసుకుంటున్న సర్కార్
- రేవంత్‌రెడ్డి తీరు వల్ల 3వేల రైతు కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి
- బాధిత కుటుంబాలకు 5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- యథావిధిగా రైతుబీమా పథకాన్ని అమలుచేయాలి
- లేకపోతే సీఎం ఇల్లు, సెక్రటేరియట్‌ను ముట్టడిస్తం
- బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ టీ హరీశ్‌రావు స్పష్టం
- 22మంది రైతుబీమా రాని కుటుంబాలతో సమావేశం



సిద్దిపేట, **అభ్యుదయం**

ఆపద సమయంలో ఆదుకొనే రైతుబీమా పథకాన్ని వెంటనే అమలుచేయకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు హెచ్చరించారు. రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ, కేసీఆర్ అమలుచేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసి వాళ్ల ఉసురుపోసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నియోజకవర్గంలో రైతుబీమా అందని 22 మంది కుటుంబాలతో గురువారం సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ ఆగస్టు 15నుంచి ఇప్పటివరకు ఒక సిద్దిపేటలో 22మంది, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3వేల మంది రైతులు మృతిచెందారని, ప్రభుత్వం రైతుబంధు నిలిపివేయడం వల్ల ఆ మూడు వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు.రైతుబీమా అమలు చేసి ఉంటే అన్ని కుటుంబాలు ఎందుకు కన్నీళ్లు పెడుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆగస్టు 14నుంచి ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకపోవడం వల్లే రాష్ట్రంలో రైతుబీమా ఆగిపోయిందని చెప్పారు. మరి ఇప్పుడు వారికి ఏం సమాధానం చెబుతారని, ప్రభుత్వం ఎలా ఆదుకుంటుందో చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఐక్యరాజ్యసమితి సైతం

మిగతా 2లో

## వైఎస్సార్‌సీపీ మేయర్, మున్సిపల్ అభ్యర్థుల జాబితా విడుదల



తాడేపల్లి**అభ్యుదయం** వైఎస్సార్‌సీపీ మేయర్, మున్సిపల్ అభ్యర్థుల జాబితా గురువారం రాత్రి విడుదలైంది. వైఎస్సార్‌సీపీ విజయనగరం మేయర్ అభ్యర్థిగా కోలగట్ల శ్రావణి, వైఎస్సార్‌సీపీ విశాఖ మేయర్ అభ్యర్థిగా వరుదు కల్యాణి పేరును పార్టీ ప్రకటించింది. మిగతా మేయర్ అభ్యర్థుల జాబితా:ఏలూరు మేయర్ అభ్యర్థిగా గంటా మోహన్‌రావు (జీఎంఆర్), మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా లంకా జ్యోతి,ఒంగోలు మేయర్ అభ్యర్థిగా కుప్పం ప్రసాద్, నెల్లూరు మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి,

మిగతా 2లో



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో

## ఐక్యంగా కృషి చేయాలి

**కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి గెలుపే లక్ష్యంగా పనివేయాలి**
**గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం**
**ములుగు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు: మంత్రి సీతక్క**

నారద న్యూస్, ములుగు,**అభ్యుదయం**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

- మిగతా 2లో పేజిలో



# రాష్ట్రపతి తో మంత్రి లోకేష్ భేటీ

అమరావతి,అభ్యుదయం

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, సరస్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గురువారం విజయవాడ నోవాటెల్ హోటల్ కు వెళ్లిన మంత్రి లోకేష్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము ని శాలువాతో ఘనంగా సత్కరించి మంగళగిరి చేనేత చీర, ఏటికొప్పాక కళాకృతిని బహూకరించారు.

## పట్టభద్రుల నిరాసక్తత..

మిగతా 2లో

# అధికారుల నిర్లక్ష్యం

**వెరిఫికేషన్‌లో అధికారుల అలసత్వం**
**మందకొడిగా ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు**
**నత్తనడకన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ**
**వచ్చిన దరఖాస్తులు 3,53,897 మాత్రమే**
**ఆమోదం పొందినవి 2409, తిరస్కరణ 220**
**ఇక మిలిగింది 20 రోజులే**




హైదరాబాద్, **అభ్యుదయం**

తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ఎవరికీ పట్టని వ్యవహారంగా మారింది. అటు పట్టభద్రులైన ఓటర్ల నమోదు ప్రక్రియ అత్యంత నిస్తేజంగా, నత్తనడకన సాగుతుండగా..ఇటు వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. శాసనమండలికి ఇద్దరు సభ్యులను ఎన్నుకొనేందుకుగాను ఓటర్లుగా నమోదు చేసుకొనేందుకు పట్టభద్రులు ఆసక్తి చూపడం లేదు.




## '140 కోట్ల భారతీయులను గర్వపడేలా చేశారు'..

- 18వ ఆసియా క్రీడల్లో పతకాలు కొల్లగొట్టిన భారత బృందం
- ఆసియాడ్ విజేతలకు ప్రధాని అభినందన..!
- ఇటీవల ఆసియా క్రీడల్లో పతకాలతో మెరిసిన భారతబృందం

2లో

అభ్యుదయం
The Pride of Telugu national daily

శుక్రవారం 16-10-2026

# రైతుబీమా అమలు చేయకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తం



మెచ్చుకున్న రైతు బీమా పథకాన్ని నిలిపివేయడానికి ప్రభుత్వానికి మనసెలా వచ్చిందని ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాలు మన పథకాన్ని చూసి అమలు చేస్తుంటే.. ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బంద్ చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతు సంక్షేమం గురించి గొప్పలు చెప్పే రేవంత్‌రెడ్డికి రూ.1,400 కోట్ల ప్రీమియం చెల్లించే తెలివి లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాణాలు కోల్పోయిన 3వేల మంది రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ వెంటనే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించి యథావిధిగా రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగిరాకపోతే రైతు కుటుంబాలతో కలిసి సీఎం ఇంటిని, సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతు కుటుంబాలు ఆందోళన చెందవద్దని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అసెంబ్లీ వేదికగా రైతు బీమా అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, బీమా డబ్బులు వచ్చేలా చేస్తామని చెప్పారు.

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు, ఆయుష్ ఉద్యోగులు, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని, వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమలును విస్మరించిందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. గురువారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఆయన సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడేండ్లు కావస్తున్నా ఆ హామీల అమలుచేయకపోవడంతో ఉద్యోగులు నిరాశకు గురవుతున్నట్టు తెలిపారు. 15వ తేదీ వచ్చినా వారికి వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో 1న వేతనాలు ఇచ్చినట్టు గుర్తుచేశారు. వెంటనే ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హత ప్రకారం జీపీఎఫ్, ఈఎస్ఐ ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

స్కావెంజర్ల సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తా..

సావెంజర్ల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి పరిష్కారానికి కృషిచేస్తానని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. సిద్దిపేటలో సమ్మెచేస్తున్న స్కావెంజర్లకు గురువారం సంఘీభావం తెలిపారు. సమస్యలను కలెక్టర్, మంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పది నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండటం బాధాకరం, దసరా పండుగలోపు బకాయిలు విడుదలయ్యేలా కృషిచేస్తానని వారికి భరోసా ఇచ్చారు.

# వైఎస్సార్‌సీపీ మేయర్, మున్సిపల్ అభ్యర్థుల జాబితా విడుదల

కడప మేయర్ అభ్యర్థిగా బండి దీప్తిరెడ్డి

మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థులు:

ఇచ్ఛాపురం మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా రాజ్యలక్ష్మి, పలాస మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా తలసు శ్రీపద్మ, నర్సీపట్నం మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా చింతకాయల అనిత, యలమంచిలి మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా బి.తులసి,తుని మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా పిట్ల రామతులసి, కొవ్వూరు మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా మన్నె పద్మ,

రామచంద్రాపురం మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా నాగేశ్వరరావు, కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా నల్లమోతు తేజస్వీ,

తెనాలి మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా మద్దలి శేషాచలం, చీరాల మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా డా.ఇస్త్రార్ల శెర్లి, బద్వేల్ మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా రాచపూడి వెంకట సాయి కృష్ణ, ప్రొద్దుటూరు మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా పొరెడ్డి నరసింహారెడ్డి, పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా వైఎస్ ప్రమీలమ్మ, మదనపల్లె మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా జింక చలపతి.

నగర పంచాయతీ అభ్యర్థులు:

ఏలేశ్వరం నగర పంచాయతీ అభ్యర్థిగా బదిరెడ్డి ఆశా లత,
ఉయ్యూరు నగర పంచాయతీ అభ్యర్థిగా పైడముక్కల దివ్య,
గురజాల నగర పంచాయతీ అభ్యర్థిగా పోలు వీరా రెడ్డి,
కనిగిరి నగర పంచాయతీ అభ్యర్థిగా పులి శాంతి రెడ్డి,
బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ అభ్యర్థిగా షేక్ షకీలా బేగం,
కమలాపురం నగర పంచాయతీ అభ్యర్థిగా మార్జుల కవిత లను ప్రకటించారు.

# సస్పెండ్ చేయాల్సింది డిప్యూటీ సీఎంను. చీఫ్ ఇంజనీర్‌ను కాదు!

హనుమకొండ అక్టోబర్15: రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సమస్యలకు బాధ్యత వహించాల్సిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై చర్యలు తీసుకోకుండా, పేద సామాజిక వర్గానికి చెందిన చీఫ్ ఇంజనీర్‌ను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. గురువారం హనుమకొండలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ పనితీరుపై సమీక్షలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అధికారులను బాధ్యులను చేస్తూ చేతులు దులుపుకోవాలని చూస్తోందని విమర్శించారు.తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అర్ధరాత్రి వరకు విధులు నిర్వహించే గిరిజన సామాజిక వర్గానికి చెందిన సురేష్ అనే అధికారిని సస్పెండ్ చేయడం అన్యాయమని ప్రవీణ్ కుమార్ అన్నారు. విద్యుత్ శాఖలో నెలకొన్న సమస్యలకు అసలు కారణాలను గుర్తించకుండా ఒక అధికారిపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఇంధన శాఖపై ప్రభుత్వం ఎందుకు సమీక్షలు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ రంగంలో అనుభవం ఉన్న నిపుణుల సేవలను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని, థర్మల్ పవర్ స్టేషన్లలో ఐఏఎస్ అధికారుల నియామకాలపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. సంబంధిత రంగాల్లో నైపుణ్యం ఉన్నవారిని కాకుండా ఇతరులను నియమిస్తున్నారని విమర్శించారు.

నాసిరకం బొగ్గుతోనే విద్యుత్ కష్టాలు

విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. నాణ్యమైన గ్రేడ్-9 బొగ్గుకు బదులుగా నాసిరకం బొగ్గును సరఫరా చేయడం వల్ల విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ కోతలు ఎల్‌నినో ప్రభావంతో వచ్చినవి కావని, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల ఏర్పడినవేనని విమర్శించారు.

# ‘140 కోట్ల భారతీయులను గర్వపడేలా చేశారు’..

దేశం గర్వపడే ప్రదర్శన చేసిన క్రీడాకారులతో గురువారం భేటీ అయిన మోడీ ‘మీరు 140 కోట్ల భారతీయులను గర్వపడేలా చేశార’ని అన్నారు. ఆసియాడ్‌లో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిన అథ్లెట్లు, క్రికెట్ టీమ్‌లను ప్రధాని ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో సన్మానించారు. ఈ సందర్భంగా భారత బృందం సతకాలు చేసిన జెర్సీని మోడీకి బహూకరించింది.నగోయ వేదికగా జరిగిన 18వ ఆసియా క్రీడల్లో పతకాలు కొల్లగొట్టిన భారత బృందాన్ని గురువారం ప్రధాని నరేంద్ర మోడీ కలిశారు. గత ఎడిషన్‌లో మాదిరిగా ఈసారి సెంచరీ కొట్టకున్నా సరే దేశ ప్రజలంతా గర్వపడే ప్రదర్శన చేసినందుకు వారిని మోడీ అభినందించారు.

‘మీరు 140 కోట్ల భారతీయులు గర్వపడేలా చేశారు. పోడియం మీద త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగరేయడం మీరు సాధించిన పెద్ద విజయం. అందుకే.. ఈ విజయం మీది మాత్రమే కాదు దేశంలోని కోట్లాది మందికి చెందుతుంది. దేశ ప్రజలందరి తరఫున మిమ్మల్ని అభినందిస్తున్నా. 18వ ఆసియాడ్‌లో గెలుపొందిన 85 పతకాల్లో.. 38 మహిళా అథ్లెట్లు సాధించినవే. వీటిలో పదకొండు స్వర్ణాలు ఉండడం భారత్‌కు చాలా ప్రత్యేం. అద్భుత ప్రదర్శన చేసిన మహిళా అథ్లెట్లకు నేను శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ఇక్కడ హాకీ జట్లు రెండు ఉన్నాయి. హాకీలో పురుషుల, మహిళల జట్లు స్వర్ణాలు పట్టేశాయి.ముఖ్యంగా.. మహిళల జట్టు 41 ఏళ్ల తర్వాత ఆసియాడ్‌లో మొదటిసారి పసిడి పతకంతో చరిత్ర లిఖించింది’ అని ఆసియా క్రీడల బృందంతో భేటీ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడా శాఖా మంత్రి మన్సూఖ్ మాండవీయ, భారత కోచింగ్ బృందం, తదితరులు పాల్గొన్నారు. ఇటీవలే ముగిసిన ఆసియా క్రీడల్లో వందకు పదిహేను పతకాల దూరంలో ఆగిపోయిన భారత్.. నాలుగో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.

# మహిళా శక్తితోనే వికసిత భారత్ సాధ్యం

అమరావతి, మహిళా శక్తిని ఆర్థిక శక్తిగా మార్చడం ద్వారా వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని
కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. గురువారం విజయవాడ లో జాతీయ సరస్ మేళా ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళలకు తగిన అవకాశాలు కల్పిస్తే పారిశ్రామికవేత్తలుగా ఎదిగి వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పించగలరు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమైన ఆరు కోట్ల మంది మహిళలను లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో ఇప్పటికే సుమారు మూడున్నర కోట్ల మంది మహిళలు లక్ష్యాన్ని చేరుకున్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఒడిశాలోని మారుమూల మన్యం నుంచి భారత రాష్ట్రపతి పీఠం వరకు సాగించిన ప్రయాణం, ద్రౌపది ముర్ము జీవితం మహిళల ఆత్మవిశ్వాసానికి, పట్టుదలకు, సామర్థ్యానికి నిదర్శనం. అడుగడుగునా సామాజిక అడ్డంకులు, వ్యక్తిగత జీవితంలో తీరని విషాదాలు ఎదురైనా, ఆ కన్నీటినే సమాజ సేవకు ఇంధనంగా మార్చుకున్న అపర ధైర్యశాలి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాలు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒకప్పుడు బ్యాంకు గుమ్మం తొక్కడానికే భయపడిన గ్రామీణ మహిళలు, నేడు దేశ బ్యాంకింగ్ వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారు. 2014లో సుమారు రూ.23 వేల కోట్లుగా ఉన్న మహిళా సంఘాల వార్షిక రుణ లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. ఇప్పటివరకు మహిళా సంఘాలకు సుమారు రూ. 13 లక్షల కోట్ల రుణాలు అందించబడ్డాయి. డ్వాక్రా సంఘాలకు మరింత ఊతమిచ్చేలా రూ. 20 లక్షల వరకు రుణాలపై ప్రాసెసింగ్, తనిఖీ, డాక్యుమెంటేషన్ తదితర ఛార్జీలను రద్దు చేయడం ద్వారా ఒక్కో డ్వాక్రా సంఘానికి సుమారు రూ.33 వేల వరకు ఆదా అయ్యే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. రాష్ట్రంలో అమలు చేసిన ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించింది. మహిళా సంఘాల లావాదేవీల్లో పారదర్శకత పెంచేందుకు, డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థలను ప్రవేశపెట్టింది. స్వయం సహాయక సంఘాల సమగ్ర వివరాలను, వారి ఆర్థిక లావాదేవీలను డిజిటలైజ్ చేయడం కోసం భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ లోకో ఎస్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. గతంలో ఢిల్లీకి పరిమితమైన జాతీయ సరస్ మేళాను విజయవాడలో నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణం అన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐక్యంగా కృషి చేయాలి

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్నారు. కార్యకర్తల నిరంతర శ్రమ, త్యాగాల ఫలితంగానే నాయకులు ఉన్నత పదవుల్లో కొనసాగుతున్నారని అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. పట్టభద్రుల ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని కోరారు.

గ్రామీణ యువతకు స్థానికంగానే ఉపాధి

ములుగు జిల్లా అధికంగా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలతో కూడుకున్నదని, ఇక్కడి నిరుపేద యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే పలు జాబ్ మేళాలు నిర్వహించినట్లు చెప్పారు. ఉపాధి కోసం యువత తమ కుటుంబాలను విడిచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులను తగ్గించేందుకు స్థానికంగానే పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఐటీ రంగంతో పాటు ఆయిల్‌పామ్ పరిశ్రమ, ఇతర పరిశ్రమలను జిల్లాకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# రేపే సీజేపీ భారీ నిరసన..

**అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్న ఢిల్లీ పోలీసులు**

ఢిల్లీ, ఢిల్లీలో సీజేపీ చేపట్టనున్న ఆందోళన విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు గురువారం వివరించారు. సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో గురువారం, అక్టోబర్ 16న భారీ నిరసనకు ఆ పార్టీ ఫౌండర్ అభిజీత్ దీప్కే పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ వద్ద ఉన్న సెంట్రల్ పార్క్‌లో లెహ్రా దో తిరంగా పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు దీప్కే ప్రకటించారు. దీనికోసం కార్యకర్తలు, దేశభక్తులు జాతీయ జెండాలతో రావాలని దీప్కే పిలుపునిచ్చారు.అయితే, ఈ నిరసనను వ్యతిరేకిస్తూ ఢిల్లీకి చెందిన వ్యాపార సంఘం అయిన పలికా బజార్ వ్యాపారులు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీజేపీ ఆందోళన వల్ల తమ వ్యాపారం దెబ్బ తింటుందని, తాము నష్టపోతామని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని, పోలీసులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. దీనిపై ఢిల్లీ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ నితిన్ వాసుదేవ్ సంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మ ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపి నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులకు గురువారం ఢిల్లీ పోలీసులు బదులిచ్చారు.

సీజేపీ, ఆ పార్టీ ఫౌండర్ దీప్కే చేపట్టనున్న ఆందోళన విషయంలో తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని కోర్టుకు తెలిపారు. ఎలాంటి ఆందోళన తలెత్తకుండా, ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని పోలీసులు కోర్టుకు హామీ ఇచ్చారు. తగిన నిఘా, భద్రత ఏర్పాటు చేశామని, అవసరమైతే దీప్కేపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కోర్టుకు పోలీసులు వివరించారు. ఇదే సమయంలో.. సీజేపీ, దీప్కే ఈ ఆందోళన చేపట్టకుండా చూడాలంటూ పిటిషనర్లు చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. వారు ఆందోళన చేయకుండా నిరోధించేలా తాము ఆదేశాలు జారీ చేయలేమని పేర్కొంది.

అయితే, ఈ విషయంలో ఇప్పటికే తగిన సూచనలు, ఆదేశాలు ఇచ్చామని కోర్టు తెలిపింది. సీఈసీ రాజీనామా కోరుతూ సీజేపీ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా ఆందోళన జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ఆందోళనలో నిబంధనలు ఉల్లంఘించినందుకుగాను ఇప్పటికే సీజేపీ అగ్రనేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా తిహార్ జైలుకు తరలించారు.

# పట్టభద్రుల నిరాసక్తత.. అధికారుల నిర్లక్ష్యం

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదుకు షెడ్యూల్ విడుదలై 20 రోజులు కావస్తున్నా 30 శాతం మంది కూడా తమ ఓటు హక్కు కోసం ముందుకురాలేదు. గతంలో ఈ రెండు స్థానాలకు ఎన్నికలు జరిగినప్పుడు 10 లక్షల మందికిపైగా ఓటర్లు ఉన్నారు. కానీ ఈసారి ఇప్పటివరకు కేవలం 3.53 లక్షల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు అధికారులు సైతం వచ్చిన దరఖాస్తులను పరిశీలించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటివరకు 3,53,897 దరఖాస్తులు రాగా, కేవలం ఒక్కశాతం దరఖాస్తులనే పరిశీలించారు. 3,53,897 దరఖాస్తుల్లో 2,409 ఆమోదం పొందగా, 220 తిరస్కరించారు.మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు గురువారం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గం పరిధిలో 1,52,905 దరఖాస్తులు రాగా, అందులో 94 దరఖాస్తులనే ఆమోదించారు. ఇంకా 99.9 శాతం దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నా యి. రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాల్లో ఆమోదించిన దరఖాస్తుల సంఖ్య దాదాపు సున్నా. వరంగల్- ఖమ్మం- నల్లగొండ నియోజకవర్గంలో 2,00,992 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు ఆమోద పొందినవి 2,315 మాత్రమే. దాదాపు 1,98,460 (98.7%) దరఖాస్తులు పెండింగ్‌లో పడి ఉన్నాయి. బూత్ లెవల్ అధికారి (బీఎల్వో) స్థాయిలోనే లక్షలాది అప్లికేషన్లు నిలిచిపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది.

నాడు 5,31,268 ఓట్లు.. నేటి దరఖాస్తులు 1,52,905

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గం పరిధిలో గతంలో (2021) మొత్తం ఓటర్లు 5,31,268గా నమోదయ్యారు. కానీ ఈసారి ఇప్పటికి 1,52,905 దరఖాస్తులే వచ్చాయి. గతంతో పోలిస్తే దాదాపు 71 శాతం కంటే ఎకువ మంది పట్టభద్రులు ఇంకా నమోదు ప్రక్రియకు దూరంగానే ఉన్నారు. గతంలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లా నుంచి 1,44,416 మంది ఓటర్లు ఉండగా, ఇప్పుడు ఆ జిల్లా నుంచి కేవలం 43,624 దరఖాస్తులే వచ్చాయి. నాడు మేడ్చల్ మల్కాజిగిరి నుంచి 1,31,284 ఓట్లు ఉండగా, నేడు 28,561 దరఖాస్తులు, హైదరాబాద్ నుంచి 1,10,243 ఓట్లు ఉండగా, ఇప్పుడు 17,073 దరఖాస్తులు మాత్రమే అందాయి. గడిచిన ఐదేండ్లలో పట్టభద్రుల సంఖ్య గణనీయంగా పెరుగగా, దరఖాస్తులు మాత్రం బాగా తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తున్నది.

# దేశం వీడాలని ఇమ్రాన్ ఖాన్‌కు నోటీసులు..

## ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా నిబంధనలు ఇవే!




ప్రముఖ బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ ఖాన్ భారతదేశాన్ని అక్టోబర్ 28 నాటికి వీడాలని ముంబైలోని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఫ్రీ==ా) ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ముంబైలోని క్రాంతి మైదాన్ వద్ద చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (జజుజ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ జరిగిన ఒక రాజకీయ నిరసన కార్యక్రమంలో ఇమ్రాన్ ఖాన్ పాల్గొనడంతో ఈ వివాదం తెరపైకి వచ్చింది. బీజేపీ నాయకుడు కిరీట్ సోమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు ఈ చర్య తీసుకున్నారు. అయితే అమెరికా పౌరసత్వం కలిగి ఉన్న ఇమ్రాన్ ఖాన్‌కి భారత ప్రభుత్వం నుంచి ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా (రాజ×) కార్డ్ కూడా ఉంది. అయితే ఈ కార్డ్ వలన విదేశీయులకు వర్తించే సౌకర్యాలతో పాటు నిబంధనలపై ప్రస్తుతం నెట్టింటా చర్చ జరుగుతుంది. కాగా.. అసలు ఈ ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా కార్డు వలన ప్రయోజనలు ఏంటో ఇప్పుడు చూద్దాం.2005లో ప్రవేశపెట్టిన ఓసీఐ పథకం ద్వారా విదేశాల్లో స్థిరపడిన భారతీయులకు భారతదేశాన్ని రావడానికి, ఇక్కడ నివసించడానికి మరియు కొన్ని ఆర్థిక, విద్యాపరమైన ప్రయోజనాలను పొందడానికి జీవితకాల వీసా సదుపాయం లభిస్తుంది. అయితే, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ ద్వంద్వ పౌరసత్వంకాదని, ఓసీఐ హోల్డర్లు కేవలం విదేశీ పౌరులు మాత్రమేనని చట్టం స్పష్టం చేస్తోంది. భారతీయులకు లభించే రాజకీయ హక్కులు, ఓటు హక్కు, ఎన్నికల్లో పోటీ చేయడం లేదా ప్రభుత్వ ఉద్యోగాలు వంటివి ఓసీఐ హోల్డర్లకు వర్తించవు. అలాగే వ్యవసాయ భూములు, ఫామ్‌హౌస్‌లను కొనుగోలు చేయడానికి వీరికి అనుమతి లేదు. భారత రాజ్యాంగం ప్రకారం భావప్రకటన స్వేచ్ఛ మరియు శాంతియుతంగా సమావేశమయ్యే హక్కులు భారతీయ పౌరులకే ప్రత్యేకంగా వర్తిస్తాయి కానీ విదేశీయులకు ఆ సంపూర్ణ హక్కులు ఉండవు. ఈ నిబంధనల ఉల్లంఘన కింద విదేశీయుల చట్టం మరియు ఇమ్మిగ్రేషన్ నిబంధనల ప్రకారం విదేశీ పౌరులను దేశం విడిచి వెళ్లాల్సిందిగా ఆదేశించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి

# సీజేపీకి అమెరికా నిధులు..

## సింగర్ మిల్‌బెన్‌కు దీప్కే కౌంటర్



న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీకి అమెరికా నుంచి నిధులు అందుతున్నట్లు సింగర్ మేరీ మిల్‌బెన్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలను సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే(గూఎష్ట్రఅయివవ్ ణఅజూనెవ) కౌంటర్ ఇచ్చారు. మా దేశ వ్యవహారాల్లో విదేశీయుల జోక్యం అవసరం లేదని దీప్కే అన్నారు. అమెరికాలో ఉన్న డోనార్లు సీజేపీకి నిధులు అందజేస్తున్నట్లు మిల్‌బెన్ తన ఎక్స్‌లో పోస్టు చేశారు. విచ్ఛిన్నకర విధానంతో పనిచేస్తున్న సీజేపీని ఢీకొట్టేందుకు భారతీయ యువ దేశభక్తులు శాంతియుత ప్రదర్శన చేపట్టాలని మిల్‌బిన్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన దీప్కే.. ప్రధాని మోదీ ఎందుకు అమెరికన్ల మద్దతు కోరుతున్నారని అడిగారు. భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జాతీయులు జోక్యం చేసుకునే హక్కు ఎవరు ఇచ్చారని దీప్కే ప్రశ్నించారు. మా స్వంత సమస్యలను పరిష్కరించే సామర్థ్యం మాకు ఉందని, విదేశీయులు మా వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదు అని దీప్కే అన్నారు

# రోడ్డు మీదికి 3 వేల రైతు కుటుంబాలు..

**రైతు బీమాపై ప్రభుత్వం తక్షణమే మేల్కోవాలి : హరీశ్ రావు**



ఈ విషయమై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 3000 మంది రైతులు చనిపోయారని సమాచారముంది. ఈ 3 వేల కుటుంబాలు రైతు బీమా అందకపోవడంతో నేడు రోడ్డుమీద పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తక్షణమే ప్రభుత్వం మేల్కోవాలని సూచించారు.. ఈ 3 వేల కుటుంబాలకు కూడా రైతు బీమా డబ్బులు వెంటనే చెల్లించి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని ఒక వేళ ప్రభుత్వం దిగి రాకపోతే.. ఈ రైతు కుటుంబాలను తీసుకొచ్చి నీ ఇంటి ముందు ధర్నా చేయాల్సి వస్తదని, సెక్రటేరియట్‌ను ముట్టడించాల్సి వస్తదని సీఎం రేవంత్ రెడ్డిని, ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. అంతదూరం తెచ్చుకోకు. ఈ డబ్బులు వెంటనే ఇచ్చి రైతు బీమా పథకాన్ని కొనసాగించి ఆ కుటుంబాలను ఆదుకోండి.. లేదంటే ఈ కుటుంబ సభ్యులందరినీ తీసుకొచ్చి నీ ఇల్లు ముట్టడిస్తామని చెప్పి ఈ సందర్భంగా నేను హెచ్చరిస్తున్నా అని హరీశ్ రావు అన్నారు.బీఆర్ఎస్ పార్టీ పక్షాన రాష్ట్రవ్యాప్తంగా రైతు బీమా పథకానికి దూరమైన 3 వేల మంది కుటుంబాలను ఆదుకోవాలని.. అందరికీ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించి తక్షణమే ఎల్ఐసీకి ప్రీమియం కట్టి రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం..

**పాఠశాల పైకప్పు కూలి విద్యార్థులు, ఉపాధ్యాయురాలి మృతి..**



పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. వాయవ్య పాకిస్థాన్‌లోని పెషావర్ నగరంలో ఒక ప్రైవేటు పాఠశాల పైకప్పు కూలిపోవడంతో 21 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో 30 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గురువారం తరగతులు జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్ రాజధాని పెషావర్‌లోని దిర్ కాలనీలో ఈ ప్రమాదం జరిగింది. అల్ ఖైర్ పాఠశాల భవనంలోని పైకప్పు కూలిపోవడంతో తరగతి గదుల్లో ఉన్న చిన్నారులు శిథిలాల కింద చిక్కుకున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే అత్యవసర సేవల సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు సైతం సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గాయపడిన చిన్నారులను అంబులెన్సుల్లో ఆసుపత్రులకు తరలించారు

విద్యార్థులు, ఉపాధ్యాయురాలితో కలిపి కనీసం 21 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం వెలువడింది మృతుల సంఖ్య మరింత పెరగొచ్చని తెలుస్తోంది. మృతులంతా చిన్న వయసు పిల్లలే కావడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల భవనం నిర్మాణం బలహీనంగా ఉండటమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పెషావర్ పోలీసు అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

# అమెరికా టెంపుల్ ఘటనపై భారత్ ఆందోళన




న్యూఢిల్లీ: అమెరికాలోని ఇలియనాస్ రాష్ట్రంలో ఉన్న ఓ హిందూ ఆలయంలో 19 ఏళ్ల టీనేజర్ అలెగ్జాండ్రోస్ పపోరాకిస్ తన వద్ద ఉన్న గన్‌తో సామూహిక కాల్పులు జరపాలని భావించాడు. కానీ గన్ జామ్‌కావడంతో అతని ప్లాన్ విఫలమైంది. ఈ ఘటనలో ఆ నిందితుడిని అరెస్టు చేశారు. ఈ ఘటన పట్ల ఇవాళ భారత ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. హిందూ వ్యతిరేక, వివక్షపూరిత ప్లాన్ చాలా డిస్టర్బింగ్‌గా ఉన్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ పేర్కొన్నది. ఆ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఇవాళ మీడియాను ఉద్దేశిస్తూ ఓ ప్రకటన రిలీజ్ చేశారు.ఇలియనాస్ ఘటన అమెరికాలో భారతీయుల పట్ల ఉన్న విద్వేషాన్ని చూపిస్తుందన్నారు. అమెరికా ప్రభుత్వం విద్వేష పూరిత హింస పట్ల జీరో టాలరెన్స్ చూపించాలని, భారతీయులకు భద్రత కల్పించాలన్నారు. అరోరా టెంపుల్‌లో సామూహిక కాల్చివేతకు ప్లాన్ చేసిన నిందితుడి ని అమెరికా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, అతనిపై నమోదు చేసిన కేసులను కూడా పరిశీలిస్తున్నామని రణధీర్ తెలిపారు.అమెరికాలో ఇండియాపై ద్వేషం పెరుగుతోందన్నారు. ఈ ఘటనపై సమగ్రంగా విచారణ చేపట్టి, బాధ్యులైనవారికి శిక్షపడేలా చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రణధీర్ జైస్వాల్ కోరారు.

# ఇంద్రకీలాద్రిపై వీఐపీ ప్రోటోకాల్ దర్శనాలు రద్దు: దుర్గ గుడి ఈవో



విజయవాడ, అక్టోబర్15: మూల నక్షత్రం నేపథ్యంలో సరస్వతీ దేవి అలంకారంలో శుక్రవారం దుర్గమ్మ వారు భక్తులకు దర్శనం ఇస్తారని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఈవో శీనా నాయక్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో వీఐపీ ప్రోటోకాల్ దర్శనాలు రద్దు చేసినట్లు తెలిపారు. శక్రవారం సాయంత్రం 4:30 నుంచి 5:30 గంటల మధ్య అమ్మవారికి సీఎం చంద్రబాబు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. ఈ రోజు అర్ధరాత్రి12.30 – 12.45 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తామని అన్నారు. గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. ఇంద్రకీలాద్రిపై వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

ఈ రోజు ఐదో రోజు లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారని పేర్కొన్నారు. ఈ రోజు ఉదయం నుంచే ఇంద్రకీలాద్రికి భక్తులు భారీగా పోటెత్తారని వివరించారు. నవరాత్రులు ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 7 లక్షల మంది భక్తులు దుర్గమ్మవారిని దర్శించుకున్నారని అన్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.క్యూ లైన్లు, మూడు హోల్డింగ్ ఏరియాల్లో సుమారు 30 వేల మంది భక్తులు వేచి ఉండే విధంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 72 వేల మంది భక్తులు అన్నప్రసాద వితరణ స్వీకరించారని వివరించారు. 8.70 లక్షల లడ్డూ ప్రసాదాలు కొనుగోలు జరిగాయని పేర్కొన్నారు. అయితే ఘాట్ రోడ్డుపై ఫోర్ వీలర్ వాహనాలకు అనుమతి లేదని వాహనదారులకు స్పష్టం చేశారు.క్యూ లైన్లు, హోల్డింగ్ ఏరియాల్లో మంచినీరు, మజ్జిగ, బిస్కెట్లు, ఆహారం పంపిణీ చేస్తున్నామని వివరించారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సుంకరి భిక్షంగౌడ్

**-- పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిల్‌లో ప్రకటన**



రామగిరి, అక్టోబర్ 15 : ఉపాధ్యాయుల పీఆర్సీ, పెండింగ్ బిల్లుల పరిష్కారంపై ప్రభుత్వం ఇంకా తాత్సారం చేస్తే మరో ఉద్యమం చేపట్టక తప్పదని పీఆర్టీయూ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి హెచ్చరించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లో మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. నల్లగొండలోని జీఎం గార్డెన్‌లో గురువారం పీఆర్టీయూ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పుల్గం దామోదర్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన ఆరో రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి సుమారు 6 వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి తరలివచ్చిన ఉపాధ్యాయులతో నల్లగొండ పట్టణం పీఆర్టీయూ జెండాలతో సందడిగా మారింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ అమలు, పెండింగ్ బిల్లుల పరిష్కారం, అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు, ఈహెచ్ఎస్‌లో లోపాల సవరణ, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో పలుమార్లు తన గళాన్ని వినిపించానని తెలిపారు. ముఖ్యమంత్రి దృష్టికి కూడా సమస్యలను తీసుకెళ్లినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 1న 35 వేల మంది ఉపాధ్యాయులతో ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహించామని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకపోతే తదుపరి ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు.రాబోయే వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అధికారిక అభ్యర్థిగా రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్‌ను సమావేశంలో ప్రకటించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 15 ఏళ్లపాటు సంఘ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉందని నాయకులు తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, విద్యావంతుల సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు మరో ఉద్యమ గొంతుక అవసరమనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థిగా తనను ప్రకటించిన ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి, రాష్ట్ర సంఘ నాయకత్వానికి సుంకరి భిక్షంగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యావంతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే ప్రస్తుత ప్రభుత్వం కూడా పునరావృతం చేస్తోందని విమర్శిస్తూ, ప్రజాసమస్యలపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు.

**ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం**

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 72 వేల మంది సభ్యత్వం కలిగిన ఏకైక ఉపాధ్యాయ సంఘంగా పీఆర్టీయూ నిలిచిందని తెలిపారు. సంఘం ఆవిర్భావం నుంచి ఉపాధ్యాయుల అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని, భవిష్యత్తులోనూ అదే స్ఫూర్తితో పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ అధికార ప్రతినిధి వంగ మహేందర్‌రెడ్డి, క్రమశిక్షణ సంఘం చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శులతో పాటు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# న్యూ సేవాలాల్ తండాలో ఘనంగా తీజ్ ఉత్సవాల ముగింపు

- తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
- బంజారా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించిన వేడుకలు





భూపాలపల్లిఅక్టోబర్15: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొల్లబుద్ధారం న్యూ సేవాలాల్ తండాలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన తీజ్ ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను తండా ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తొమ్మిది రోజుల పాటు తండాలో పండుగ వాతావరణం నెలకొనగా, చివరి రోజు నిర్వహించిన ముగింపు వేడుకల్లో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయ వస్త్రధారణతో మహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బంజారా ఆచార వ్యవహారాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఉత్సవాలు తండా ప్రజల్లో ఐక్యతను చాటిచెప్పాయి. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ బంజారా సమాజంలో తీజ్ పండుగకు విశిష్టమైన స్థానం ఉందన్నారు. ఈ పండుగ ఐకమత్యానికి, భక్తిభావానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు గోధుమలను నానబెట్టి, సంప్రదాయ పద్ధతిలో మొలకలను పెంచుతూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. తరతరాలుగా వస్తున్న బంజారా ఆచార సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తండాలోని కుటుంబాలన్నీ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువత తమ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామస్తులంతా కలిసికట్టుగా ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సిరికొండ ప్రశాంత్ చారి, లంబాడీల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు లావుడియా పల్లవి రాజు నాయక్, గ్రామ సర్పంచ్ అజ్మీర జైపాల్ నాయక్, రాజు నాయక్, లావుడియా దాసు నాయక్, రాము నాయక్, బాలు నాయక్, రఘురాం నాయక్, కరణ్ నాయక్, రాజన్న నాయక్, గోపాల్ నాయక్, గోపి నాయక్, రంజిత్ నాయక్, ప్రతాప్ రామన్న, బీకన్ నాయక్, సర్దార్ నాయక్, నందు నాయక్, నంకు నాయక్, చిన్న నాయక్, సత్రం నాయక్, వసరం నాయక్, మీజిత్, రాంబాబు, రామ్, గోవర్ధన్, ప్రభు నాయక్, దన్‌సింగ్ నాయక్, రవి నాయక్, శ్రీకాంత్, పుల్లారెడ్డి, తిరుపతి, మోహన్ నాయక్, బాబు నాయక్, సునీల్, జయపాల్, ఉదయ్‌సింగ్, జల్‌సింగ్, సందీప్, సంతోష్, హేమ నాయక్, రాందాస్ నాయక్, రతన్‌సింగ్, పరంసింగ్, గోపాల్‌సింగ్, జైపాల్‌సింగ్, రాహుల్‌సింగ్, రాణా ప్రతాప్‌సింగ్, ఈశ్వర్, లక్ష్మణ్ నాయక్, కార్తీక్ నాయక్, చంద్రం నాయక్, సురేందర్ నాయక్, సోను నాయక్, అసిలాల్ నాయక్, నవీన్ నాయక్, గోవిందు నాయక్, రాజన్న, బాహుసింగ్, ఫుల్‌సింగ్, సమ్మయ్య నాయక్, జగన్, రతన్, లక్ష్మణ్, చిన్న, రజనీకాంత్‌తో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, యువజన సంఘాల నాయకులు, తండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా నాయకుడుకి జన్మదిన శుభాకాంక్షలు

**– శ్రీరామ్ నగర్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు.. బలరాం యాదవ్ –**






అభ్యుదయం. శేరిలింగంపల్లి. అక్టోబర్ 15. శేరిలింగంపల్లి శాసనసభ్యులు , పిఎసి చైర్మన్ ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ జన్మదినం సందర్భంగా శ్రీరామ్ నగర్ కాలనీ వాసులతో కలిసి శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బలరాం యాదవ్ అనంతరం అభిమాన నాయకుడి జన్మదిన సందర్భంగా కొండాపూర్ లోని ఏరియా ఆసుపత్రిలో రోగులకు ఫ్రూట్స్ అందించి తమ నాయకుడి పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజమోహన్రావు, నాగరాజు, రేపల్లె అశోక్, మాధవ్, వెంకటయ్య, ప్రేమ్, సాయి, చరణ్, మల్లికార్జున్, రవితేజ,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

**ఈ నెల 20 నుంచి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పరిమిత వైద్య సేవలు**

**డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి**

**అత్యాధునిక వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లే అవసరం తగ్గిస్తాం**

**ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**





హన్మకొండ అక్టోబర్15: పేద ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అత్యాధునిక వైద్య సేవలను ఉచితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వైద్య ఖర్చుల భారం కారణంగా పేద ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గురువారం వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి మంత్రి పొంగులేటి పరిశీలించారు. ఆసుపత్రిలో కొనసాగుతున్న నిర్మాణ పనులు, వైద్య పరికరాల ఏర్పాటు, ఆధునిక సాంకేతిక సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల కల్పనపై అధికారులతో సమీక్షించారు.

అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను వరంగల్‌లోనే అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడే పేద ప్రజలు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితులకు స్వస్తి పలికి ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అక్టోబర్ 20 నుంచి పరిమిత వైద్య సేవలు

దసరా పండుగ సందర్భంగా ఈ నెల 20 నుంచి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పరిమిత వైద్య సేవలను ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. నవంబర్ నెలలో మరిన్ని వైద్య విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చి డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తిస్థాయిలో వైద్య సేవలను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ పేదల ఉచిత వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- **ఇష్టారీతిన భారీ వాహనాలు పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి**
- **ప్రమాదాల ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి**
- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**




హన్మకొండ ఆగస్టు25: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. రహదారులపై భారీ వాహనాలు, ప్రైవేట్ టాక్సీలను ఇష్టారీతిన పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటు న్నాయని, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిలిపే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలు, రహదారుల పరిస్థితి, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, ట్రాఫిక్ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఆర్ అండ్ బీ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దేవిక జిల్లాలో రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలను వివరించారు. కోమటిపల్లి పరిధిలోని జాతీయ రహదారిపై భారీ వాహనాల కోసం ట్రక్ లే బై ఏర్పాటు, వంగపహాడ్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై జాతీయ రహదారుల శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై వాహనదారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రమాదాల నివారణ విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్లపై లైన్ మార్కింగ్ స్పష్టంగా కనిపించేలా ఉండాలని, కొత్తగా బీటీ రోడ్డు నిర్మించిన హసన్‌పర్తి వైపు రహదారిపై లైన్ మార్కింగ్‌తో పాటు రోడ్ స్టడ్స్ ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. వంగపహాడ్ వద్ద తరచూ ప్రమాదాలు జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారుల పక్కన భారీ వాహనాలు నిలపడం వల్ల ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ పెంచాలని సూచించారు.

# దివ్యాంగుల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం చేయూత

**దివ్యాంగ లబ్ధిదారుడికి బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో పంపిణీ**

**కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేతుల మీదుగా అందజేత**





హన్మకొంఅక్టోబర్15: దివ్యాంగులు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేయూత అందిస్తోందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న దివ్యాంగుల సహాయ ఉపకరణాల పథకం 2024--25లో భాగంగా కమలాపూర్ మండలానికి చెందిన దాసరి శ్రీనివాస్‌కు బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటోను పంపిణీ చేశారు. జిల్లా ఎంపిక కమిటీ ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారుడిగా ఎంపికైన శ్రీనివాస్‌కు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తమ చేతుల మీదుగా ఆటోను అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొందేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి, సాధికారత లక్ష్యంగా సంక్షేమ శాఖ ద్వారా వివిధ సహాయ ఉపకరణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వంటి ఉపాధి ఆధారిత పరికరాలు దివ్యాంగులకు జీవనోపాధి కల్పించడంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకునేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ సమాజంలో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

# తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలి

*పంటల రక్షణకు రానున్న 15--20 రోజులు కీలకం..*
*నీటి సంరక్షణ, ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి: సీఎస్ సంజయ్ జాజు*





సంగారెడ్డి ప్రతినిధి ,అక్టోబర్ 15
ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో చోటు చేసుకుంటున్న మార్పులు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రస్తుత పంటలను కాపాడేందుకు వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత, వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గురువారం సీఎస్ సంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా సింగూరు జలాశయంలో నీటి నిల్వలను పరిశీలించారు.

అనంతరం పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ట్రాన్స్‌కో సీఎండీ జితేష్ వి. పాటిల్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సింగూరు జలాశయంలో నీటిమట్టం, జిల్లాలో తాగునీటి లభ్యత, వర్షపాతం, పంటల సాగు పరిస్థితులు, తాగునీటి సరఫరాకు రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రణాళికల గురించి సీఎస్‌కు వివరించారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు. గ్రామాల వారీగా తాగునీటి అవసరాలను గుర్తించి, అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కార్యాచరణ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అగ్రిమెంటేషన్ అవసరమైన పనులన్నింటినీ నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో అవసరమైనప్పుడు నీటి రవాణా ఏర్పాట్లు చేయడంతో పాటు అవసరమైన బోర్‌వెల్లను హైరింగ్ చేసుకోవడానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

రానున్న 15--20 రోజులు పంటల రక్షణకు అత్యంత కీలకమైనందున వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితులను పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక విద్యుత్ భారం పడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి, స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

పశుగ్రాసం కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వీబీజీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ పనులు, నీటి నిల్వ కుంటల నిర్మాణం వంటి పనులను గుర్తించి చేపట్టాలని, అవసరమైన పనుల జాబితాను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

అనంతరం చౌటకూర్ గ్రామంలో కౌలు రైతు గొల్ల మహేష్ ఏడు ఎకరాల్లో సాగు చేస్తున్న పత్తి పంటను సీఎస్ పరిశీలించారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని రైతు వివరించారు. వర్షపాతం లోటు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల స్వల్పకాలిక కూరగాయ పంటలను సాగు చేయాలని సీఎస్ సూచించారు.

ట్రాన్స్‌కో సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలమట్టాలు తగ్గి విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ఆకుకూరలు, కూరగాయలను పండించడంతో పాటు కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం వంటి అనుబంధ రంగాల ద్వారా అదనపు ఆదాయం పొందేలా సంబంధిత శాఖల అధికారులు తగిన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి

**17 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి**

**ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు సంపూర్ణ మద్దతు**

**వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**

**పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక నిరసనకు సంఘీభావం**

వరంగల్‌అక్టోబర్15: తెలంగాణ రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. గురువారం వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ జంక్షన్ వద్ద వరంగల్ జిల్లా ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరసన కార్యక్రమంలో నన్నపునేని నరేందర్ పాల్గొని ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వారి పోరాటానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అనంతరం నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్న ఉద్యోగులకు తగిన గుర్తింపు, గౌరవం, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజారోగ్య వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు వంద శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో పాటు వారి కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలని, ప్రతి సంవత్సరం ఐదు శాతం ఇంక్రిమెంట్లు, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పీఆర్సీ ప్రయోజనాలను వర్తింపజేసి ఉద్యోగుల ఆర్థిక




భద్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం నిరవధిక నిరసనకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని నన్నపునేని నరేందర్ అన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించే ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల డిమాండ్లపై సంబంధిత శాఖల అధికారులు, ప్రభుత్వం స్పందించి చర్చల ద్వారా పరిష్కారం చూపాలని సూచించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు వారి పోరాటానికి సంపూర్ణ మద్దతుగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు డాక్టర్ మహేందర్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ భరత్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రుకుముద్దీన్, వరంగల్ జిల్లా ఎన్‌హెచ్‌ఎం జేఏసీ నాయకులు అనిల్, అంజి, నితిన్, డాక్టర్ రవీందర్, యశస్విని, డాక్టర్ రమ్య, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ హారిక, జ్యోతి, నర్మద, గీత, వైకుంఠంతో పాటు పలువురు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

# వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

- **డీపీఆర్, టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి**
- **ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుధ్య మెరుగుదలే ప్రధాన లక్ష్యం**
- **మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి డాక్టర్ టీ.కె. శ్రీదేవి**
- **కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

వరంగల్‌అక్టోబర్15: వరంగల్ నగరంలో ప్రతిపాదిత అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ప్రాజెక్టుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. నగరంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పారిశుధ్య మెరుగుదలకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్), టెండర్ ప్రక్రియ, సాంకేతిక అంశాలు, పరిపాలనాపరమైన అనుమతులు తదితర కీలక అంశాలపై అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా డాక్టర్ టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ వరంగల్ నగరంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ఆధునిక మురుగునీటి పారుదల వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతో నగరంలో మురుగునీటి నిర్వహణ మెరుగుపడటంతో పాటు ప్రజలకు పారిశుధ్య సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు అమలుకు సంబంధించిన సాంకేతిక, పరిపాలనా అంశాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. డీపీఆర్, టెండర్ ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ



ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న మాట్లాడుతూ వరంగల్ నగరంలో సమగ్ర భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు ద్వారా నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మురుగునీటి నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. నగర అభివృద్ధిలో కీలకమైన ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత శాఖల అధికారులు, కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ తదుపరి చర్యలను వేగవంతం చేస్తామని వివరించారు.

# జూనియర్ సివిల్ జడ్జిగా మల్లారం యువకుడు సాయి పవన్

- **మూడో ప్రయత్నంలో లక్ష్యాన్ని సాధించిన డ్యాగల సాయి పవన్**
- **ఇంజనీరింగ్ నుంచి న్యాయవిద్య వైపు అడుగులు.. న్యాయమూర్తి స్థాయికి ఎదిగిన యువకుడు**
- **సాయి పవన్‌కు పలువురు న్యాయవాదులు, ప్రముఖుల అభినందనలు**

భీమదేవరపల్లి పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసంతో ప్రయత్నిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని నిరూపించాడు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన డ్యాగల సాయి పవన్. గ్రామానికి చెందిన డ్యాగల సారయ్య, సత్యవతి దంపతుల కుమారుడు సాయి పవన్ జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల్లో విజయం సాధించి తల్లిదండ్రులతో పాటు చదువు చెప్పిన గురువులకు, స్వగ్రామానికి పేరు తీసుకువచ్చాడు. సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన సాయి పవన్ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగి న్యాయవ్యవస్థలో కీలకమైన జూనియర్ సివిల్ జడ్జి పదవికి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసిన సాయి పవన్‌కు న్యాయవ్యవస్థపై ఆసక్తి ఏర్పడింది. సమాజంలో అన్యాయాలను చట్టపరంగా ఎదుర్కోవడంతో పాటు సామాన్య ప్రజలకు న్యాయం అందించాలనే సంకల్పంతో న్యాయవిద్యను అభ్యసించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎల్‌ఎల్‌బీ ఆనర్స్ పూర్తి చేశాడు. అనంతరం ఢిల్లీ హైకోర్టు, తీస్ హజారీ జిల్లా కోర్టుతో పాటు హనుమకొండ, వరంగల్ జిల్లా కోర్టుల్లో న్యాయవాదిగా పనిచేస్తూ న్యాయవృత్తిలో అనుభవాన్ని సంపాదించుకున్నాడు.

న్యాయవాదిగా విధులు నిర్వహిస్తూనే జూనియర్ సివిల్ జడ్జి కావాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. రెండు ప్రయత్నాల్లో ఆశించిన ఫలితం రాకపోయినా నిరాశ చెందకుండా మరింత పట్టుదలతో చదివి మూడో ప్రయత్నంలో జూనియర్ సివిల్ జడ్జి పదవికి ఎంపికయ్యాడు. అంతేకాకుండా నాలుగు రోజుల క్రితం తెలంగాణ పోలీసు శాఖ విడుదల చేసిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పరీక్ష ఫలితాల్లోనూ విజయం సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు.

సాయి పవన్ తండ్రి డ్యాగల సారయ్య విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. తండ్రి నుంచి స్ఫూర్తి పొందిన సాయి పవన్ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాడు. ఒకే సమయంలో న్యాయవృత్తిని కొనసాగిస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమై రెండు కీలక పరీక్షల్లో విజయం సాధించడం విశేషం.



సాయి పవన్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు ముద్దసాని సహోదర రెడ్డి, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, ఉపాధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిల్ల రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు జన్ను పద్మ, ఎగ్గడి సుందర్ రామ్, సహచర న్యాయవాదులు నారాయణరావు, ఇ.సత్యనారాయణ రెడ్డి, ఎం.శ్రీనాథ్, చింత నిఖిల్, జన్ను ప్రభాకర్, సన్నీ కుమార్, రాహుల్, లోకేశ్వర్ తదితరులు అభినందనలు తెలిపారు. సాయి పవన్ భవిష్యత్తులో న్యాయవ్యవస్థలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

# ట్రంప్ తప్పటడుగు..

## చరిత్రలో చేదు పక్షాన నిలిచారన్న జెలెన్‌స్కీ



చరిత్రలో తప్పుడు వైపు అమెరికా : బ్రిటన్ జర్నలిస్ట్ పియర్స్ మోర్గాన్ నిర్వహించిన 'అన్‌సెన్సార్డ్' కార్యక్రమంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ కుదుర్చుకున్న డీజిల్ ఒప్పందాన్ని తీవ్రంగా ఆక్షేపించారు."మధ్యవర్తిత్వం వహిస్తే తటస్థంగా నిలబడాలి తప్ప.. అన్యాయం వైపు మొగ్గు చూపకూడదు. ఈ నిర్ణయంతో ట్రంప్ చరిత్రలో తప్పుడు పక్షాన నిలిచారు. అత్యంత కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి మద్దతును మేం కోల్పోతున్నాం" అని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్‌కు సలహాలు ఇస్తున్న వర్గాలు ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు.కాల్పుల విరమణను తుంగలో తొక్కిన రష్యా : రష్యా నుంచి తొలుత 3 లక్షల టన్నుల డీజిల్‌ను, ఆపై దశలవారీగా మిలియన్ల టన్నులను సేకరించేందుకు ట్రంప్ యంత్రాంగం పచ్చజెండా ఊపింది అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల తగ్గింపునకే ఈ నిర్ణయమని వైట్‌హౌస్ సమర్థించుకుంటోంది.

కాగా, అక్టోబర్ 11న ఇరుదేశాల మధ్య కుదిరిన 'ఇంధన కాల్పుల విరమణ' ప్రతిపాదనను మాస్కో తుంగలో తొక్కిందని జెలెన్‌స్కీ ధ్వజమెత్తారు. కీవ్, ఖార్కివ్‌లలో విద్యుత్ మౌలిక సదుపాయాలపై రష్యా బాంబుల వర్షం కురిపించడంతో 6 లక్షల మందికి పైగా ప్రజలు చీకట్లో మగ్గుతున్నారని వాపోయారు. సంక్షోభ వేళ ఉక్రెయిన్‌కు రక్షణ కవచంలా నిలబడాలని ప్రపంచ దేశాలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# అప్పన్న..నీ కొండను నువ్వే రక్షించుకో..

## వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా'




ప్రపంచ ప్రసిద్ధ జల ఉద్యమకారుడు "వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా" జల్ బిరిదారి జాతీయ కన్వీనర్ డాక్టర్ రాజేంద్ర సింగ్‌తో కలిసి గురువారం సింహాద్రినాథునికి వినతి పత్రం సమర్పించిన అనంతరం కొండడిగువ ఆయన మీడియాతో మాట్లాడారు. సింహాద్రి అప్పన్నకు సమర్పించిన మెమొరాండాన్ని జిల్లా కలెక్టర్, అటవీశాఖ అధికారులు, ప్రభుత్వ కార్యదర్శికి కూడా అందజేస్తామని చెప్పారు. పర్యావరణానికి హాని కలిగించ వద్దని న్యాయస్థానం అధికారులను ఆదేశించినప్పటికీ పనులు ఆగకపోవడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పర్యావరణ, వన్య ప్రాణుల చట్టాలను ఉల్లంఘించవద్దని గూగుల్ ప్రతినిధులకు కోర్టు చెప్పడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. చట్టాలకు అనుగుణంగానే పనిచేస్తామని చెప్పినా నేపథ్యంలో వాస్తవ పరిస్థితులు అందుకు బిన్నంగా ఉన్నాయని సత్య ఆందోళన వ్యక్తం చేశారు. వన్యప్రాణుల అభయారణ్యంగా గుర్తించిన కంభాలకొండకు అతి చెరువులో గూగుల్ సెంటర్ నిర్మాణం జరగడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. నిబంధంధనల ప్రకారం పది కిలో మీటర్ల లోపు ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా కేంద్ర అనుమతులు తప్పనిసరి అని చెబుతున్న నేపథ్యంలో ఆ నిబంధనలను సవరించి కుదించారని అన్నారు. అయితే గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం కిలో మీటర్ పరిధిలోపలే ఉందని ఆయన అన్నారు. తరులవాడ సెంటర్ కూడా రెండు కిలోమీటర్ల లోపలే ఉందని గుర్తుచేశారు. ఈ వ్యవహారం న్యాయస్థానంలో ఉన్న నేపథ్యంలో మానవ ప్రయత్నం మేము చేస్తున్నాం.."నీ భూమిని నువ్వే రక్షించుకో " అని ఆ అప్పన్నస్వామిని వేడుకుంటూ మెమొరాండం అందించినట్లు తెలియజేశారు.

# కామారెడ్డి మున్సిపాలిటీలో అక్రమాలపై విచారణ.. రికార్డుల స్వాధీనం

కామారెడ్డి, అక్టోబర్ 15: నగర మున్సిపాలిటీలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు కలకలం రేపుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు.. వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు విచారణపై దృష్టి సారించారు. ఈ క్రమంలో గతంలోనూ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టగా.. తాజాగా మరోసారి కీలక రికార్డులను స్వాధీనం చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా అభివృద్ధి పనులకు సంబంధించిన కొలతల పుస్తకాలు (ఎంబీ రికార్డులు), బిల్లుల చెల్లింపుల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా పరిణామాలతో మున్సిపాలిటీలోని సంబంధిత విభాగాల్లో చర్చ మొదలైంది.

# హోర్ముజ్‌లో భారీగా తేలియాడుతున్న ఐఫోన్ బాక్సులు..



హోర్ముజ్ జలసంధిలో ఐఫోన్లు, లగ్జరీ పెర్ఫ్యూం బాటిళ్లలతో కూడిన బాక్సులు కుప్పలు కుప్పలుగా తేలియాడాయి. యూఏఈకి చెందిన కార్గో నౌక 2500 కంటైనర్లతో బుధవారం హోర్ముజ్ జలసంధి గుండా వెళ్తుండగా మైన్‌ను ఢీకొనడంతో నౌకలో మంటలు చెలరేగాయి. తర్వాత కొన్ని నిమిషాల్లోనే నౌక మునిగిపోయిన విషయం తెలిసిందే. ఆ నౌకలో ఉన్న కంటైనర్లలో ఉన్న బాక్సుల్లో కొన్ని మునిగిపోగా, మరికొన్ని తేలియాడాయి. కంటైనర్ల నుంచి బయటకు వచ్చిన ఐఫోన్లు, పెర్ఫ్యూం బాటిళ్ల బాక్సులు సముద్రంపై భారీగా తేలియాడాయి. దీనికి సంబంధించిన వీడియో ఒకటి గురువారం వెలుగులోకి వచ్చింది. నౌక మునిగిపోయిన ప్రాంతం వద్ద ఐఫోన్లు, పెర్ఫ్యూం బాటిళ్లు వందల సంఖ్యలో తేలియాడుతున్న దృశ్యం ఆ వీడియోలో ఉంది. కొందరు చిన్నచిన్న బోట్లలో సముద్రంలోకి వెళ్లి వాటిని సేకరించిన దృశ్యాలు కూడా రికార్డయ్యాయి. కాగా.. మునిగిపోయిన ఆ నౌకను జీఎఫ్ఎస్ ప్రైడ్‌గా గుర్తించారు. సింగపూర్ జెండాతో దుబాయ్ నుంచి సరుకును రవాణా చేసుకుంటూ వెళ్తుండగా మైన్‌ను ఢీకొని ఆ నౌక సముద్రంలో మునిగిపోయింది. అందులో ఉన్న మొత్తం 21 మంది సిబ్బంది రక్షించామని మారీటైమ్ అధికారులు తెలిపారు. నౌక మునిగిపోయిన ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదన్నారు. కాగా.. హోర్ముజ్ జలసంధిలో గత పది రోజులుగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వాణిజ్య నౌకలపై ముమ్మరంగా దాడులు జరుగుతున్నాయి. గత నెలలో అమెరికా తమ పోర్టులను దిగ్బంధించి తమపై ఆంక్షలు విధించడంతో తాము ప్రతిదాడులు చేస్తున్నామని ఇరాన్ పేర్కొంది. దీంతో వ్యూహాత్మక జలమార్గం హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది

# సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు సుప్రీంకోర్టు నోటీసులు..

### జంతర్ మంతర్‌పై ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు



సర్‌లో అవకతవకలపై ఇండియా బ్లాక్ కూటమి నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కోర్టు విచారణకు స్వీకరించింది. తాజాగా ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు, అలాగే ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషికి సుప్రీంకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ఆధ్వర్యంలోని ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారిస్తోంది.దీనిలో భాగంగా గత సోమవారం కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ.. సుప్రీంకోర్టు వరకు నిర్వహించిన మార్చ్‌పై సుప్రీం బెంచ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. రాహుల్ గాంధీ తాను సుప్రీంకోర్టు వరకు చేపట్టిన ర్యాలీపై తప్పనిసరిగా వివరణ ఇవ్వాలని కోర్టు సూచించింది. ఎవ్వరూ న్యాయవ్యవస్థను బెదిరించలేరని కోర్టు అభిప్రాయ పడింది. ఈ అంశంపై దాఖలైన పిటిషన్‌లో ఒకరి తరఫున తాత్కాలికంగా విచారణ చేపడతున్నామని, అయినప్పటికీ రాహుల్ గాంధీ తన ప్రవర్తనకు సంబంధించి వివరణ ఇవ్వాలని ఆదేశించింది.ఇదే సమయంలో జంతర్ మంతర్ అంశంపై కూడా కోర్టు స్పందించింది. జంతర్ మంతర్‌ను నిరసనల ప్రదేశ జాబితా నుంచి ఢిల్లీ ప్రభుత్వం తొలగించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై స్పందించిన కోర్టు.. ఢిల్లీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో సీజేపీ నేతలు జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహించాలనుకున్నారు. దీంతో ఆ ప్రదేశాన్ని నిరసన ప్రదేశంగా తొలగిస్తూ ఢిల్లీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సీజేపీ తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

జంతర్ మంతర్‌ను తిరిగి నిరసన ప్రదేశంగా మార్చాలని ఆ పిటిషన్‌లో కోరారు. దీన్ని విచారణకు స్వీకరించిన కోర్టు.. ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. అంతకుముందు.. సర్‌లో అవకతవకలు, సీఈసీ రాజీనామా అంశాలపై రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఇండియా బ్లాక్ కూటమి పార్టీలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి.

# నేపాల్ ప్రధానిగా కొత్త ఒరవడి..

### చైనాకు షాకిస్తూ భారత్‌కు ఓటేసిన బాలెన్ షా..!



నేపాల్, నేపాల్ ప్రధాని బాలెన్ షా ఆనవాయితీకి చెక్ పెట్టారు. జెన్‌జీ ప్రతినిధిగా ప్రధాని పదవి చేపట్టిన ఆయన కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ ద్వైపాక్షిక చర్చల కోసం భారత్‌ను ఎంచుకున్నారు. తనకంటే ముందువారు తొలుత చైనా, టర్కీ, యూకే.. వంటి దేశాలకు వెళ్లగా తను మాత్రం ఇండియాకు తొలి ప్రధాన్యమిచ్చారు. ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన చర్చల కోసం నవంబర్‌లో ఆయన విచ్చేస్తున్నారు. బాలెన్ షా ప్రధాని అయ్యాక దేశ ప్రయోజనాల కోసం చేపడుతున్న తొలి విదేశీ పర్యటన ఇదే కావడం విశేషం.జెన్‌జీ ఆందోళనల అనంతరం నేపాల్ ప్రధాని పీఠంపై కూర్చున్న బాలెన్ షా త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. ఆనవాయితీ ప్రకారం మాజీ ప్రధానులు తమ తొలి విదేశీ పర్యటనకు ఇతర దేశాలను ఎంచుకోగా ఆయన మాత్రం ఇండియాకు ఓటేశారు. మార్చిలో ప్రధాని పదవి చేపట్టిన ఆయన తొలుత భారత దైత్యాధికారులతో మాట్లాడేందుకు నిరాకరించినా.. చివరకు పర్యటనకు సిద్ధమవుతున్నారు.ఈ నవంబర్‌లోనే ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక చర్చల కోసం బాలెన్ షా విచ్చేస్తున్నారు. నవంబర్ రెండు లేదా మూడో వారంలో ఆయన ఇండియా రానున్నారు. ఖాట్మండు పోస్ట్ కథనం ప్రకారం ఈ పర్యటన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీతో ఆయన ప్రధాన నిర్మాణపరమైన ప్రాజెక్టులు, సరిహద్దు వివాదాలు, వరదల నియంత్రణ చర్యలు వంటి అంశాలపై చర్చించే అవకాశముంది.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సుంకరి భిక్షంగౌడ్



రామగిరి, అక్టోబర్ 15 : ఉపాధ్యాయుల పీఆర్సీ, పెండింగ్ బిల్లుల పరిష్కారంపై ప్రభుత్వం ఇంకా తాత్సారం చేస్తే మరో ఉద్యమం చేపట్టక తప్పదని పీఆర్టీయూ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి హెచ్చరించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లో మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. నల్లగొండలోని జీఎం గార్డెన్‌లో గురువారం పీఆర్టీయూ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పుల్లం దామోదర్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన ఆరో రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి సుమారు 6 వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి తరలివచ్చిన ఉపాధ్యాయులతో నల్లగొండ పట్టణం పీఆర్టీయూ జెండాలతో సందడిగా మారింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ అమలు, పెండింగ్ బిల్లుల పరిష్కారం, అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు, ఈహెచ్ఎస్‌లో లోపాల సవరణ, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో పలుమార్లు తన గళాన్ని వినిపించానని తెలిపారు. ముఖ్యమంత్రి దృష్టికి కూడా సమస్యలను తీసుకెళ్లినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 1న 35 వేల మంది ఉపాధ్యాయులతో ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహించామని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకపోతే తదుపరి ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సుంకరి భిక్షంగౌడ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అధికారిక అభ్యర్థిగా రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్‌ను సమావేశంలో ప్రకటించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 15 ఏళ్లపాటు సంఘ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉందని నాయకులు తెలిపారు.




## అమెజాన్‌లో మరోసారి లేఆఫ్స్..

### ఈ సారి వాళ్లను టార్గెట్ చేసిన కంపెనీ..

ప్రముఖ ఈకామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. రాయిటర్స్ కథనం ప్రకారం.. మంగళవారం రోబోటిక్స్ యూనిట్‌లోని ఉద్యోగులను తీసేసింది. ఈ లేఆఫ్స్ కారణంగా రోబోటిక్ యూనిట్‌లోని 100 వైట్ కాలర్ జాబ్స్‌పై ప్రభావం పడింది. రోబోట్స్ డిజైనింగ్, ఆటోమేషన్ కోసం ఉపయోగిస్తున్న రవాణా వ్యవస్థలతో పాటు వేర్ హౌస్‌లో పని చేసే వారి ఉద్యోగాలు పోయాయి. కాగా, అమెజాన్ సంస్థ గత ఏడాది 30 వేల మందిని తొలగించబోతున్నట్లు ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ ఏడాది అక్టోబర్ నెలలో 14 వేల మంది ఉద్యోగులను తొలగించింది.
2026 జనవరి నెలలో ఏకంగా 16 వేల మంది ఉద్యోగులను బయటకు పంపేసింది. భవిష్యత్తులో కూడా లేఆఫ్స్ కొనసాగుతాయని ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే మరోసారి 100 మందిని ఉద్యోగంలోంచి తీసేసింది. లేఆఫ్స్‌పై కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ గతంలో మాట్లాడుతూ.. 'ఆర్థికపరమైన విషయాల వల్ల ఉద్యోగాలు తీసేయడం లేదు. అలాగని ఏఐ కారణంగానూ తొలగించడం లేదు. కంపెనీ సంప్రదాయంలో భాగంగానే లేఆఫ్స్ జరుగుతున్నాయి. ఏటా కొత్త ఉద్యోగులను తీసుకుంటూనే ఉంటాం. అలాంటప్పుడు ఉద్యోగుల సంఖ్య కూడా పెరుగుతూ పోతుంది. అందుకే లేఆఫ్స్ తప్పవు' అని అన్నారు.

# స్టాక్ మార్కెట్లకు ఉపశమనం




పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా గత మూడు సెషన్లలో భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు గురువారం కోలుకున్నాయి. అణు ఒప్పందం విషయంలో ఇరాన్ కాస్త వెనక్కి తగ్గినట్టు ఆ దేశ విదేశాంగ మంత్రి మాట్లాడడం సూచీలపై పాజిటివ్ ప్రభావాన్ని చూపింది. స్టాక్ మార్కెట్లకు ఉపశమనం.. వరుస నష్టాలకు బ్రేక్..పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా గత మూడు సెషన్లలో భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు గురువారం కోలుకున్నాయి

అణు ఒప్పందం విషయంలో ఇరాన్ కాస్త వెనక్కి తగ్గినట్టు ఆ దేశ విదేశాంగ మంత్రి మాట్లాడడం సూచీలపై పాజిటివ్ ప్రభావాన్ని చూపింది. అలాగే కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం, అంతర్జాతీయంగా కొన్ని సానుకూల సంకేతాలు సూచీలను లాభాల వైపు నడిపించాయి. అలాగే డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి కాస్తంత కోలుకుంది. అలాగే ఆయిల్, గ్యాస్ రంగ స్టాక్స్‌లో కొనుగోళ్లు కూడా కలిసొచ్చాయి. చివరకు సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో రోజును ముగించాయి.

గత సెషన్ ముగింపు (79,116)తో పోల్చుకుంటే గురువారం ఉదయం 400 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత ఆ లాభాలు మరింత పెరిగాయి. ఒక దశలో దాదాపు 1200 పాయింట్లు లాభపడి 80,303 వద్ద ఇంట్రాడే గరిష్ఠానికి చేరుకుంది. చివరకు సెన్సెక్స్ 811 పాయింట్ల లాభంతో 79,927 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 285 పాయింట్ల నష్టంతో 24,765 వద్ద స్థిరపడింది
.
సెన్సెక్స్, నిఫ్టీలో మాజగాన్ డాక్, నాల్కో, బ్లూ స్టార్, బీఎస్ లిమిటెడ్, పెట్రోనాట్ ఎల్ఎన్‌జీ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి ఆయిల్ ఇండియా, కేపీఐటీ టెక్, ఎంఫసిస్, కోఫోర్జ్, పెర్సిస్టెంట్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 867 పాయింట్లు లాభపడింది. బ్యాంక్ నిఫ్టీ 300 పాయింట్లు ఆర్జించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 91.60గా ఉంది.




## పసిడి ప్రియులకు పండగ లాంటి వార్త

యుద్ధం కారణంగా బంగారం ధరలు భారీగా పతనం అవుతున్నాయి. రోజురోజుకు తగ్గుతూ ఉన్నాయి. తాజాగా దేశీయ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పడిపోయాయి. గురువారం ఉదయం 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.980 తగ్గి.. రూ.1,63,530 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర కూడా భారీగానే తగ్గింది. 10 గ్రాములకు రూ.900 తగ్గి.. 1,49,900 పలుకుతోంది.ఇక బుధవారం(నిన్న) 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,64,510 రూపాయలు..10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 1,50,800 రూపాయలు..10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 1,23,380 రూపాయలు పలికింది. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావంతో అంతర్జాతీయ గోల్డ్ మార్కెట్‌లో అనిశ్చితి నెలకొంది. ఫలితంగా దేశీయ మార్కెట్‌లో ధరలు భారీగా పతనం అయ్యాయి.

## సర్వైకల్ క్యాన్సర్‌పై పోరు



మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ ముప్పును తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ప్రాథమిక వైద్యశాలలు, ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 14 నుంచి 15 ఏళ్ల మధ్య ఉన్న బాలికలకు ఈ వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ వ్యాక్సిన్ వేయించడం ద్వారా గర్భాశయ క్యాన్సర్ నుంచి దాదాపు 98శాతం మేరకు రక్షణ కల్పిస్తుందని వైద్యులు నిర్ధారించారు. ప్రభావవంతమైన వ్యాక్సిన్‌ను తగిన వయస్సులోనే ఇవ్వాల్సి ఉంటుంది.
శరీర రోగ నిరోధక వ్యవస్థ చిన్న వయస్సులోనే మెరుగ్గా స్పందిస్తుండటంతో ఈ వ్యాక్సిన్ బాలికలకు ఒకే మోతాదుతో సరిపోతుందని వైద్యులు నిర్ధారించడంతో తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఆ కార్యక్రమాన్ని ఆరంభించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఈ వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు ప్రారంభించారు.

**టెన్త్ పరీక్షలలోపే వ్యాక్సినేషన్..**

ఇప్పటికే జిల్లాలో 14 నుంచి 15 ఏళ్లలోపు బాలికలు 34,596 మంది ఉన్నట్లు వైద్యాధికారులు ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యాక్సిన్లను కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి పంపుతుండగా తదనుగుణంగా జిల్లాలకు రాష్ట్రస్థాయి నుంచి సరఫరా కానుంది. మన ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరో వారం, పది రోజుల్లో ఈ వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా బాలికలను గుర్తించారు. త్వరలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానుండటంతో ఆ లోపు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.
ఆలోపు జిల్లాకు వ్యాక్సిన్ రాని పక్షంలో పరీక్షలు ముగిసిన అనంతరం బాలికలకు వేయనున్నారు. ఈ వ్యాక్సిన్‌ను బాలికల ఇళ్ల వద్ద కాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ వైద్యశాలల్లో వేయనున్నారు. ఇప్పటికే బాలికల నివాసం, వారి స్వగ్రామం, వారి వయస్సు తదితర వివరాలన్నింటిని వైద్యశాఖ సేకరించింది. ఈ వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్‌ను మాత్రమే కాకుండా కొన్ని ఇతర రకాల గొంతు క్యాన్సర్‌లను కూడా నివారించేందుకు దోహదపడుతుందనే విషయాన్ని విస్తృత ప్రచారం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

# దేశంలో ఎల్ఎన్‌జీ కొరత

టీచర్‌పై విద్యార్థి దాడి.. వీడియో వైరల్..

బిహార్ సీఎం సంచలన ప్రకటన.. నేడే రాజ్యసభకు నామినేషన్!




న్యూఢిల్లీ: ఇరాన్ దాడుల కారణంగా ఖతార్ ఎల్ఎన్‌జీ ఎగుమతులను నిలిపి వేసింది. దీంతో ఆ దేశం నుంచి మన దేశానికి ఎల్ఎన్‌జీ దిగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. మన దేశానికి అవసరమైన ఎల్ఎన్‌జీ అవసరాల్లో 40% ఖతార్ నుంచే దిగుమతవుతోంది. తాజా పరిణామాలతో దేశంలోని సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు; ఎరువులు, గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులకు ఎల్ఎన్‌జీ సరఫరాల్లో 40 శాతం కోత విధిస్తున్నట్టు పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ ప్రకటించింది. ఇదే సమయంలో స్పాట్ మార్కెట్‌లో ఎల్ఎన్‌జీ ధర రెట్టింపైంది. ఇంత ధర పెట్టి కొన్నా, హార్మోజ్ జల సంధి మూసివేతతో అది మన తీరానికి చేరే అవకాశాలు పెద్దగా కనిపించడం లేదు. ఒకవేళ ఈ అడ్డంకులను అధిగమించి దిగుమతి చేసుకున్నా, కొనేందుకు సీజీడీలు, పారిశ్రామిక సంస్థలు ముందుకు రావడం లేదు.వంట గ్యాస్‌కీ కష్టాలే: వంట గ్యాస్‌కీ కొరత ముంచుకొస్తోంది. దేశంలో వినియోగించే వంట గ్యాస్‌లో 90 శాతానికి దిగుమతులే దిక్కు. ఇందులో పెద్ద మొత్తం సౌదీ అరేబియా, కువైట్, యూఏఈల నుంచి దిగుమతవుతోంది. ఇరాన్ దాడులతో ఈ దేశాల నుంచి ఎల్‌పీజీ దిగుమతులు ఆగిపోయాయి. ప్రస్తుతం దేశంలో ఉన్న నిల్వలు నెల రోజులకు మించి రావని అంచనా. దీంతో ఈ పరిస్థితి నుంచి ఎలా బయట పడాలనే అంశంపై అధికార వర్గాలు, ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్నాయి. అమెరికా, రష్యా వంటి దేశాల నుంచి దిగుమతికి అవకాశం ఉంది. అయితే ఇప్పటికే అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో ఎల్‌పీజీ ధరలు కొండెక్కా యి. దీనికి తోడు గల్ఫ్ దే శాల నుంచి ఐదారు రోజు ల్లో వచ్చే ఎల్‌పీజీ నౌకలు, భారత్‌కు చేరేందుకు నెల నుంచి నెలన్నర పడుతుందని సమాచారం.

## ఉదయం ఖాళీ కడుపుతో ఎన్ని గ్లాసుల నీరు తాగాలి?

చాలా మందికి ఉదయం నిద్రలేవగానే ఖాళీ కడుపుతో నీరు తాగే అలవాటు ఉంటుంది. ఇది మంచి అలవాటుగా భావిస్తారు. అయితే, ఉదయం ఎంత నీరు తాగాలి? ఎక్కువగా తాగాలా? లేక ఒకటి రెండు గ్లాసులు సరిపోతాయా? అనే సందేహాలు చాలామందికి ఉంటాయి.

ఆరోగ్య నిపుణుల ప్రకారం, ఉదయం ఖాళీ కడుపుతో ఒకటి నుంచి రెండు గ్లాసుల నీరు తాగడం సరిపోతుంది. ఒకేసారి ఎక్కువగా తాగితే కడుపులో అసౌకర్యం కలగొచ్చు. నీరు నెమ్మదిగా తాగడం మంచిది. అలాగే చాలా తక్కువ నీరు తాగితే శరీరానికి పూర్తిగా ప్రయోజనం ఉండదు. కాబట్టి సమతుల్యంగా తాగడం ముఖ్యం.

**ఉదయం నీరు తాగడం వల్ల ప్రయోజనాలు**

రాత్రి సమయంలో వచ్చిన డీహైడ్రేషన్ తగ్గుతుంది.

శరీరం తాజాగా, తేలికగా అనిపిస్తుంది.

జీర్ణక్రియ ప్రారంభమవుతుంది.



రోజంతా హైడ్రేటెడ్‌గా ఉండటానికి సహాయపడుతుంది.

బద్ధకం తగ్గి చురుకుదనం పెరుగుతుంది.

ఉదయం నీరు తాగడం వల్ల రోజంతా సరైన పరిమాణంలో నీరు తాగే అలవాటు కూడా వస్తుంది.

**జాగ్రత్తలు**

ఒకేసారి ఎక్కువగా నీరు తాగకూడదు

కడుపు లేదా మూత్రపిండ సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకోవాలి.

ముఖ్యంగా, మీ శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడం చాలా అవసరం. దాహం, అసౌకర్యం వంటి లక్షణాలను బట్టి నీరు తీసుకోవాలి. బలవంతంగా కాకుండా సహజంగా ఈ అలవాటును అలవరచుకోవడం మంచిది.

# జైలర్ 2' మూవీ రివ్యూ..

సినిమా పేరు: జైలర్ 2
తారాగణం: రజనీకాంత్, మోహన్‌లాల్, శివరాజ్‌కమార్, హృతిక్‌రోషన్, మిథున్ చక్రవర్తి, విద్యాబాలన్, రమ్యకృష్ణ, ఎస్.జె.సూర్య..
దర్శకత్వం: నెల్సన్ దిలీప్‌కుమార్
నిర్మాణం: కళానిధి మారన్..
సంగీతం: అనిరుథ్



రజనీకాంత్ 'జైలర్' సినిమా ఆయన కెరీర్‌లోనే టాప్ గ్రాసర్‌గా నిలిచింది. దాదాపు 650కోట్ల పైచిలుకు వసూళ్ల రాబట్టిన సినిమా అది. సాధారణంగా సూపర్‌స్టార్ సినిమాకు అంచనాలు సహజం. అందునా ఆయన నటించిన బ్లాక్‌బస్టర్ 'జైలర్'కు సీక్వెల్ అనగానే మళ్లీ తెరపై టైగర్ ముత్తువేల్ పాండియన్ జారీ చేసే హుకుం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకొని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తలైవా అభిమానులతో పాటు సామాన్య ప్రేక్షకులు సైతం 'జైలర్ 2' కోసం ఆసక్తిగా ఎదురు చూశారు. ఎన్నో విడుదల తేదీలను మార్చుకున్న ఈ సినిమా ఎట్టకేలకు గురువారం విడుదలైంది. మరి 'జైలర్' స్థాయిలో 'జైలర్ 2' ఉన్నాడా? మళ్లీ టైగర్ ముత్తువేల్ పాండియన్ తనదైన స్టైల్‌లో తనదైన గ్రేస్‌తో వెండితెరను షేక్ చేశాడా? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే ముందు కథలోకి వెళ్లాలి...

కథ
రిటైర్డ్ జైలర్ ముత్తువేల్ పాండియన్ తన కొడుకుతోపాటు విలన్ వర్మ(వినాయకన్)ను కూడా చంపడంతో 'జైలర్' కథ ముగిసింది. ఇక తమ అనుచరుడైన వర్మను చంపిన వ్యక్తి కోసం ప్రమాదకరమైన కల్పక్ కుటుంబం (ఎస్.జె.సూర్య ఫ్యామిలీ) వెతకడం మొదలుపెట్టడంతో 'జైలర్ 2' కథ మొదలవుతుంది. ఓపెన్‌చేస్తే.. రిటైర్డ్ జైలర్ ముత్తువేల్ పాండియన్ ఓ సూపర్ మార్కెట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తుంటాడు. తన కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకుంటూ ప్రశాంతంగా జీవిస్తున్న ముత్తువేల్ పాండియన్ చుట్టూ కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో అనుకోని సమస్యలు చుట్టుకుంటాయి. గడిచిన సంఘటన ప్రతిఫలం ఇంకా తనను వెంటాడుతున్నదని, తన కుటుంబం సమస్యల్లో ఉన్నదని ముత్తువేల్‌కి అర్థమవుతుంది. దాంతో తను అలర్ట్ అవుతాడు. తనకోసం వెతుకుతున్న వాళ్లను ట్రాప్‌లోకి దించి, ఒక్కో సమస్యలను అధిగమించుకుంటూ, కల్పక్ కుటుంబాన్ని ముత్తువేల్ ఏ విధంగా అంతమొందించాడు? అనేది మిగతా కథ.

విశ్లేషణ
తొలి పార్ట్ ముగింపులోనే రాబోయే సమస్య గురించి డిస్కస్ చేశాడు దర్శకుడు నెల్సన్. ఆ సమస్యను ఎస్.జె.సూర్య కుటుంబం రూపంలో చాలా భయంకరంగా రివీల్ చేశాడు. తొలి పార్ట్‌లో ముత్తువేల్ పాండియన్ మాత్రమే ఆడియన్స్‌కి డైనోసార్‌లా కనిపించాడు. ఈ సెకండ్ పార్ట్‌లో విలన్‌లతో కలిపి ఓ జురాసిక్ పార్క్‌నే చూపించేశాడు నెల్సన్. తెరపై మానవరూపంలో ఉన్న డైనోసార్లు కొట్టుకున్నట్టుంది సినిమా. ఒక్కో సమస్యని అధిగమిస్తూ, ఎత్తుకు పైఎత్తులు వేసుకుంటూ అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో సినిమాను నడిపించాడు నెల్సన్.
రజనీకాంత్‌ని శారీరకంగా ఆయన పెద్ద ఇబ్బంది పెట్టలేదు. కేవలం ఆయన చరిష్మాను, ఆయన స్టైల్‌ని, ఆయన ఆరాని మాత్రమే వాడుకుంటూ ఓ సూపర్‌స్టార్‌తో సినిమా ఎలా తీయాలో చూపించాడు నెల్సన్. టైగర్ చేతిలో ఆయుధాల్లా మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, హృతిక్‌రోషన్ అదరగొట్టేశాడు. వాళ్ల స్క్రీన్ ప్రెజన్స్ ఓ రేంజ్‌లో ఉంది. జాకీష్రాఫ్ క్యారెక్టర్ అంతగా ఆకట్టుకోలేదు. సినిమా ఆద్యంతం ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్‌తోనూ ఎమోషనల్‌గా సాగింది. ముఖ్యంగా పరిస్థితులకు తగ్గట్టు వేరియేషన్స్ చూపిస్తూ తలైవా నటించిన తీరు సూపర్. నెల్సన్ స్క్రీన్‌ప్లే ఈ సినిమా ప్రాణం. ముఖ్యంగా క్లైమాక్స్, ప్రీ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్ సినిమాకే హైలైట్. అయితే.. 'జైలర్' ఫస్ట్ పార్ట్‌లో ఉన్నన్ని భావోద్వేగాలు సెకండ్ పార్ట్‌లో కనిపించవు. రజనీ మార్క్ ఎలివేషన్స్, అతిథి పాత్రలు ఆకట్టుకున్నా.. ఓ సందర్భంలో ఫస్ట్ పార్ట్‌నే చూస్తున్న ఫీల్ కలుగుతుంది. అభిమానులకు మాత్రం ఈ సినిమా విజువల్ ఫీస్ట్.

నటీనటులు
జైలర్ ముత్తువేల్ పాండియన్‌గా రజనీకాంత్ మరోసారి విశ్వరూపం చూపించారు. సీరియస్‌గా ఉంటూ కామెడీ పండించ ‐డం.స్టైలిష్‌గా యాక్షన్‌ని పండించడం.. ముఖ్యంగా కొడుకు విషయంలో తను చేసింది కుటుంబానికి తెలిసిన సందర్భంలో పలికించిన హావభావాలు నిజంగా సూపర్. ఆయనలోని కంప్లీట్ యాక్టర్‌ని ఇందులో చూడొచ్చు. ఇక విలన్ కల్పక్‌గా సూర్య తనదైన శైలిలో అదరగొట్టేశాడు. విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి నెగిటీవ్ పాత్రల్లో అద్భుతంగా నటించారు.
సాంకేతికంగా..
రజనీకాంత్‌ని చూపించడంపై వందశాతం దృష్టిపెట్టాడు నెల్సన్. కథపై మాత్రం పూర్తిగా దృష్టిపెట్టలేదు. కథపై కూడా ఇంకాస్త వర్క్ చేస్తే సినిమా ఇంకా బాగా వచ్చేది. ఇక అనిరుథ్ ఆర్.ఆర్‌తో చెలరేగిపోయాడు. పాటలు కూడా వినడానికీ, చూడ్డానికి కూడా బావున్నాయి. ఎడిటింగ్, కెమెరా వర్క్ సమర్థనీయంగానే ఉన్నాయి. మొత్తంగా సూపర్‌స్టార్ల సమ్మేళనం ఈ సినిమా. మాస్ ప్రేక్షకులకైతే ఈసినిమా కన్నుల పంటే. తలైవా అభిమానులకైతే విందుభోజనమే అనాలి.

# కథలు నచ్చక..కాస్త విరామం..!



తొమ్మిది నెలలుగా తాను ఒక్క చిత్రాన్ని కూడా అంగీకరించలేదని అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్ స్పష్టం చేసింది. అల్లు అర్జున్ 'రాకా' చిత్రంలో ఈ భామ కీలక పాత్రను పోషిస్తుందనే వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో మృణాల్ ఠాకూర్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 'గత తొమ్మిది నెలలుగా ఏ సినిమాకూ సంతకం చేయలేదు. ఆఫర్లు బాగానే వస్తున్నాయి. కానీ కథలు నా మనసుకు నచ్చడం లేదు.

అందుకే సినిమాలకు విరామం తీసుకున్నా. ఒక సినిమా కోసం మూడునాలుగు నెలల సమయాన్ని వెచ్చించాల్సి వస్తున్నది. అంత సమయాన్ని కేటాయిస్తున్నామంటే కథలో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి కదా' అని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. 'రాకా' సినిమాలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్నదని, ఆమె షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నదని ముంబై సినీ వర్గాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకూ చిత్రబృందం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# సంబరాల ఏటిగట్టు' తర్వాత సాయి తేజ్ నెక్ట్స్ ప్రాజెక్ట్ ఫిక్స్!

సాయి దుర్గా తేజ్ తదుపరి చిత్రానికి సంబందించిన అప్డేట్ వచ్చింది. విభిన్నమైన కథలు, వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఇప్పుడు ఆయన 19వ చిత్రాన్ని ప్రారంభించేందుకు రెడీ అయ్యారు. తన పుట్టినరోజు సందర్భంగా ఈ కొత్త ప్రాజెక్టును ప్రకటిస్తూ అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. సాయి దుర్గా తేజ్ నటించబోతున్న19వ చిత్రానికి తేజ కాకుమాను (ఽవయిఖ ఖుఎబఖుఅబ) దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనుంది. అనిల్ సుంకర నిర్మాత. ఓటీటీలో మంచి ఆదరణ పొందిన 'సేవ్ ది టైగర్స్' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న తేజ కాకుమానుఇప్పుడు ఈ సినిమాతో వెండితెరపై తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు. కుటుంబ సంబంధాలు, వినోదం చుట్టూ సాగే కథలను ఆసక్తికరంగా తెరకెక్కించడంలో తేజ కనుమకు మంచి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఆయన మెగా హీరో కోసం ఎలాంటి కథను సిద్ధం చేశారు? తేజ్‌ను ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారు? అనే ఆసక్తి మెగా అభిమానుల్లో ఉంది. మరోవైపు సాయి దుర్గా తేజ్ ప్రస్తుతం నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'సంబరాల ఏటిగట్టు'పైనా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాతో కొత్త తరహా కథను ప్రేక్షకులకు అందించేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.






# 'భారతీయుడు 3' వర్సెస్ 'స్పిరిట్', 'వారణాసి'..

విలక్షణ దర్శకుడు శంకర్, లోకనాయకుడు కమల్ హాసన్ కలయికలో వచ్చిన 'భారతీయుడు' సినిమాకు ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం ఉంది. అయితే ఈ చిత్రానికి కొనసాగింపుగా వచ్చిన 'భారతీయుడు 2' మాత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు అందరి దృష్టి మూడో భాగమైన 'భారతీయుడు 3'పై పడింది. రెండో భాగంతో ఎదురైన నిరాశను అధిగమించి, ఈసారి ప్రేక్షకులను మెప్పించాలని చిత్రబృందం భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే, ఈ సినిమా విడుదల తేదీపై తాజాగా ఆసక్తికరమైన ప్రచారం మొదలైంది. ప్రచారంలో ఉన్న సమాచారం ప్రకారం, 'భారతీయుడు 3'ను వచ్చే ఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే విడుదల తేదీపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదే సమయంలో పలు భారీ చిత్రాలు కూడా వేసవి సీజన్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్', మహేశ్ బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్. రాజమౌళి రూపొందిస్తున్న 'వారణాసి' వంటి చిత్రాల విడుదల షెడ్యూళ్లపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. వీటితో పాటు 'ఫోర్స్' అనే చిత్రం కూడా అదే సమయంలో విడుదల కానుందనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సినిమాలన్నింటి విడుదల తేదీలు, వాటి మధ్య పోటీ ఎలా ఉండబోతోందనే అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

# రూ.2500 కోట్లకు పైగా వసూళ్లు..

ఓటీటీలోకి రాబోతున్న 'అబ్సెషన్ అన్‌కట్ వెర్షన్'




ాఎంవంంఱశీఅ। హాలీవుడ్‌తో పాటు వరల్డ్ వైడ్ బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన హర్రర్ థ్రిల్లర్ 'అబ్సెషన్' డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. కర్రీ బార్కర్ (జబతీఎ దీుతీనవతీ) దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.2,500 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి సినీ విశ్లేషకులను సైతం విస్మయపరిచింది. కేవలం రూ.9 కోట్ల బడ్జెట్‌తో రూపొంది, బాక్సాఫీస్ వద్ద అసాధారణ విజయాలను నమోదు చేసిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు వస్తోంది.ఈ చిత్రానికి సంబంధించిన 'అబ్సెషన్: ది ఒరిజినల్ అన్‌కట్ వెర్షన్' (ాఎంవంంఱశీఅ: ఌ్రవ ూతీఱస్త్రఱఅaశ్రీ ఖఅషబ్‌ ఎవతీంఱశీఅ) జియో హాట్‌స్టార్ (జీఱశీనశీర్‌ుతీ) వేదికగా స్ట్రీమింగ్ కానుంది. అక్టోబర్ 30వ తేదీన సాయంత్రం 7 గంటల నుంచి ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ అందుబాటులోకి రానుంది. ప్రియులు దీన్ని వీక్షించేందుకు అమితాసక్తిగా ఎదురుచూస్తున్నారు. మైఖేల్ జాన్సన్, ఇందే నవారెట్టే ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్, థియేటర్లలోనే కాకుండా ఓటీటీలో కూడా సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమవుతోంది.